సాక్షి
కాకినాడ
బుధవారం । 4 । జూన్ । 2025



నాణ్యమైన విద్యకు నవోదయం

జవహర్ నవోదయ విద్యాసమితిలో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.


8లో



ఇద్దరు లారీ డ్రైవర్ల దుర్మరణం

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం వద్ద హైవేపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు మృతి చెందారు.

డెల్టాలకు 500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 200 కలిపి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 7,437 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారిగా సూర్య అరవింద్



సిద్ధేశ్వరానంద భారతి స్వామి

తుని: తమిళనాడులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారిగా తునికి చెందిన డాక్టర్ కాదంబరి సూర్య అరవింద్ నియమితులయ్యారు. ఆయన సోదరుడు కాదంబరి రామకృష్ణ ఈ విషయం తెలిపారు. అరవింద్ చిన్నప్పటి నుంచీ ఆధ్యాత్మిక చింతన, భక్తి భావనతో ఉండేవాడని, ఎంబీబీఎస్ చదివి, శ్రీ సిద్ధేశ్వరి పీఠంలో చేరారని చెప్పారు. భక్తిశ్రద్ధలతో సేవలందించిన అరవింద్‌కు పీఠాధిపతి, జగద్గురువు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి.. దత్తేశ్వరానంద భారతి స్వామిగా సన్యాస నామం ఇచ్చి, ఉత్తరాధికారిగా నియమించారని వివరించారు. ఈ నెల 6న కుర్తాళంలో ఆయన పట్టాభిషేకం జరుగుతుందని తెలిపారు.

పీఎం సూర్యఘర్‌కు సహకరించాలి

కాకినాడ సిటీ: పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ ఏర్పాటుకు అధికారులు, బ్యాంకర్లు చొరవ చూపాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ సకాలంలో సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటు చేయాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ ఏర్పాటుకు బ్యాంకర్ల ద్వారా రుణ మంజూరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనికోసం జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, వారం వారం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ప్రక్రియ సజావుగా సాగేలా చూస్తామని చెప్పారు. మండలాలు, పట్టణాల వారీగా సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్ ఏర్పాటు చేసే వారితో డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది సమన్వయం చేసుకొని, లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

వంకర పాదాలు సరి చేయొచ్చు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: పుట్టుకతో వచ్చే వంకర పాదాలను సరి చేయవచ్చని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.అరుణ తెలిపారు. వరల్డ్ క్లబ్ ఫుట్ డే సందర్భంగా కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ లెక్చర్ గ్యాలరీలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డీఈఐసీ), క్యూర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ, పుట్టుకతో వంకర పాదాలను గుర్తిస్తే వైద్యులు, సామాన్యులు జీజీహెచ్‌లో ఉన్న డీఈఐసీకి సిఫారసు చేయాలని సూచించారు. ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ మాట్లాడుతూ, పుట్టిన 21 రోజుల్లోగా చికిత్స అందించగలిగితే వంకర పాదాలు పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ నిపుణుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే చికిత్సా విధానాల ద్వారా శిశువు జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. అవసరానికి అనుగుణంగా టినోటమీ అనే మైనర్ శస్త్రచికిత్స నిర్వహిస్తామని డాక్టర్ విఠల్ అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులతో పాటు, క్యూర్ ఇండియా ప్రతినిధులు, డీఈఐసీ సిబ్బంది, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఫిజియోథెరపీ నిపుణులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం, వరల్డ్ క్లబ్ ఫుట్ డే సందర్భంగా డాక్టర్ విఠల్ కేక్ కట్ చేసి, పిల్లలకు అందించారు.

స్కూటీపై వెళ్తుంటే.. చైన్ లాక్కుపోయారు

కరప: గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెంబడించి, విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి తిరిగి వెళ్తున్న మహిళా ఉద్యోగి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పోయారు. పోలీసుల కథనం ప్రకారం.. కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన కొండేపూడి శాంతి శివ కుమారి కరప మండలం వేళంగిలోని ఎస్‌బీఐ బ్రాంచిలో టెంపరరీ వర్కర్‌గా పని చేస్తున్నారు. ఆమె సోమవారం సాయంత్రం తన స్కూటీపై గొల్లపాలెం వెళ్తుండగా సిరిగలపల్లి లంక గ్రామం దాటిన తర్వాత దుండగులు ఈ ఘాతుకానికి ఒడిగట్టి, వేగంగా పరారయ్యారు. బాధితురాలు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏం చెప్పారు..

ఏం చేశారు?



- హామీలు ఊదరగొట్టారు
- ఆచరణ మరిచారు
- లక్షలాది మందిని వంచించారు
- కూటమి పాలనపై జనాగ్రహం
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన నేడు వెన్నుపోటు దినం
- నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎన్నికల ముందు ఏం చెప్పారు.. ఏడాది పాలనలో ఏం చేశారంటూ కూటమి సర్కారును జనం ప్రశ్నిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మాటల గారడీతో వంచించారని, అధికారంలోకి వచ్చాక నిలువునా దగా చేశారని, కక్ష సాధింపులు, వేధింపులు, అక్రమ కేసులతో పాలన సాగించడమేమిటంటూ మండిపడుతున్నారు. నమ్మించి నట్టేట ముంచడంలో చంద్రబాబును మించిన నాయకుడు లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూపర్ సిక్స్ అంటూ ఆశలు కల్పించి ఏడాది పాలనలో జనసంక్షేమాన్ని గాలికొదిలేశారని గర్హిస్తున్నారు. పేదలను మోసం చేసిన కూటమి సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి బుధవారానికి ఏడాది పూర్తవుతోంది. నాటి ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలతో ప్రజల జీవితాల్లో అనేక మార్పులు వస్తాయని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి నేతలు జిల్లాలో ఊరూవాడా ఊదరగొట్టారు. తీరా ఫలితాలు వచ్చాక హామీలపై ముఖం చాటేశారు. చెప్పిన మాటలకు, చేసిన పనులకు అసలు పొంతన లేకుండా ఏడాది పాలన సాగించడం చూసి జనం విస్తుపోతున్నారు. చేసిందల్లా సందుగొందుల్లో మద్యాన్ని ఏరులై పారించడం తప్ప మరొకటేదీ లేదని విమర్శిస్తున్నారు.

వంచన సాగిందిలా..

- 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని చెప్పి, ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.
- **తల్లికి వందనం పేరిట ‘నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ గత ఎన్నికల్లో భారీ ప్రచారం నిర్వహించారు. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ ఇస్తామన్నారు. తీరా చూస్తే జిల్లాలోని 3 లక్షల 20 వేల మంది పిల్లలకు ఎగనామం పెట్టిన చంద్రబాబు పాలనపై తల్లిదండ్రులు** ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రతి ఒక్కరికీ ఉచిత వంట గ్యాస్ సిలిండర్ అన్నారు. తీరా చూస్తే దానిని కొందరితోనే సరిపెట్టేశారు.
- ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమన్నారు. దీనిపై కనీసం విధివిధానాలే రూపొందించ లేదు.
- ఇంటింటికీ ఉద్యోగం ఇస్తామని.. లేకపోతే ప్రతి నెలా రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని చెప్పి నిరుద్యోగులను నిలువునా దగా చేశారు. జిల్లాలో 5,33,908 కుటుంబాలున్నాయి. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక్కరిని లెక్కేసినా జిల్లాలో ఐదు లక్షల మందికి పైగా నిరుద్యోగులున్నారు. వీరిలో ఏ ఒక్కరికీ ఉద్యోగం కానీ, నిరుద్యోగ భృతి కానీ ఇప్పటి వరకూ ఇవ్వలేదు. పైగా ఉన్న ఉద్యోగాలు కూడా ఊడగొట్టారు. మద్యం దుకాణాల్లో పని చేసే ఐదారు వందల మంది చిరుద్యోగులను, 12,272 మంది గ్రామ, వార్డు వలంటీర్లను తొలగించారు.
- అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అని చెప్పారు. జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడిన రైతు కుటుంబాలు రెండున్నర లక్షల పైనే ఉన్నాయి. వీరిలో లక్షా 70 వేల మంది రైతులకు ద్వారా ఈ పథకం కింద పెట్టుబడి సాయం ఇవ్వాల్సి ఉండగా గత ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రెండో ఏడాది ఖరీఫ్ ప్రారంభమైపోయి మే నెల వచ్చేసినా ఇప్పటికీ చంద్రబాబు సర్కార్ మొండిచేయే చూపిస్తోంది.

అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా మే నెల మొదట్లోనే వైఎస్సార్ రైతు భరోసా అందించేవారు. కూటమి పాలనలో పండించిన ధాన్యం కూడా అమ్ముకోలేకపోయామని, అమ్ముకున్న చోట కనీస మద్దతు ధర కూడా దక్కలేదని రైతులు మండిపడుతున్నారు.

- ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలను కూటమి సర్కారు నిలిపివేసింది.

నేడు వెన్నుపోటు దినం

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి సర్కారు తీరుకు నిరసనగా వైఎస్సార్ సీపీ బుధవారం వెన్నుపోటు దినం పేరిట నిరసన ర్యాలీలు చేపడుతోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు నిర్వహించనున్నారు. నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యాన ఎక్కడికక్కడ గ్రామాల నుంచి తరలివచ్చే ప్రజలను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయనున్నారు. దీనికోసం పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి.

వివిధ పథకాలు అమలవక జిల్లాలో నష్టపోయిన లబ్ధిదారులు

పథకం	లబ్ధిదారులు
తల్లికి వందనం	3,20,000
అన్నదాత సుఖీభవ	1,70,000
సున్నా వడ్డీ పంట రుణాలు	2,13,399
ఉచిత పంటల బీమా	2,10,581
ఇన్‌పుట్ సబ్సిడీ	67,000
ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్ (మెయింటినెన్స్ ఫీజు, రీయింబర్స్‌మెంట్ ఫీజు)	48,700

అక్రమాలు.. దందాలు

- **కూటమి పా**లనలో మట్టి, గ్రావెల్ **మాఫియా, భూ**కబ్జాలు, ఆక్రమణలు, దందాలు, అక్రమ వసూళ్లతో తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు.
- తుని, పిఠాపురం ప్రాంతాల్లో దేవదాయ భూములకు వేలం జరగకుండా అడ్డం పడి దొడ్డిదారిన దోచుకునేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమయ్యారు.
- పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు ఎర్ర గ్రావెల్ కొండలను పిండి చేసి, వాటాలు వేసుకుంటున్నారు.
- కొత్త మద్యం పాలసీ పేరుతో ఊరూరా బెల్టు షాపులు, పర్మిట్ రూములకు అనుమతులిచ్చి జిల్లాను మత్తులో ముంచుతున్నారు. యువత మద్యం, గంజాయికి బానిసైపోయినా సర్కారు చెవికెక్కడం లేదు. మద్యాన్ని ఏరులై పారిస్తోంది. జిల్లాలో అధికారిక మద్యం దుకాణాలు 171 ఉండగా, సందుగొందుల్లో సుమారు 500 బెల్ట్ షాపులు అడ్డగోలుగా ఏర్పాటు చేశారు.
- జిల్లాలో ఇంటింటికీ రేషన్ తీసుకువచ్చిన 428 ఎండీయూ వాహనాలను తొలగించి, తిరిగి పాత రోజుల్లోకి తీసుకుపోయారు.

సూపర్‌సిక్స్‌తో మోసం




సూపర్ సిక్స్ సహా గత ఎన్నికల్లో 130 హామీలు ఇచ్చి, మోసం చేసిన చంద్రబాబు సర్కార్‌పై జనం తిరగబడే రోజులు వచ్చేశాయి. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఏ ఒక్క హామీ అమలు చేయకుండా జనాన్ని నిలువునా దగా చేశారు. అందుకే ప్రజాపక్షంగా ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు వైఎస్సార్ సీపీ వెన్నుపోటు దినం నిర్వహిస్తోంది. బలహీనవర్గాలకు రాయితీ రుణాలని గొప్పగా ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైపోయినా ఒక్కరికైనా రుణం ఇచ్చారేమో చెప్పాలి. తీరని అన్యాయానికి గురైన బీసీలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైంది.

– అల్లి రాజబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, బీసీ జేఏసీ కో కన్వీనర్, కాకినాడ

అన్ని వర్గాలకూ హ్యాండిచ్చారు





కూటమి సర్కార్ అన్ని వర్గాలకు హ్యాండిచ్చింది. ఏడాది పాలనలో అన్ని రంగాలనూ భ్రష్టు పట్టించింది. ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసింది. ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి, చివరకు ప్రజలను మోసం చేసింది.

– సుంకర విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, కాకినాడ జిల్లా

నరకాపురం రోడ్డు



రోడ్డే.. చెరువులా..: కానూరు వద్ద ఏర్పడిన భారీ గోతులు



కారులో కేర్‌ఫుల్‌గా వెళ్లాల్సిందే..: కానూరు శశి పాఠశాల వద్ద గొయ్యి

- అడుగుకో నుయ్యి.. గజానికో గొయ్యి..
- అధ్వానంగా నిడదవోలు – నరసాపురం రహదారి
- నిత్యం ప్రమాదాలతో ప్రయాణికుల్లో భయాందోళన
- గోతులు పూడ్చి, చేతులు దులుపుకొన్న యంత్రాంగం

పెరవలి: నిడదవోలు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వరకూ ఉన్న ఆర్అండ్‌బీ రహదారి నరకానికి రూటులా మారింది. అడుగుకో నుయ్యి.. గజానికో గొయ్యి అన్న చందంగా గోతులు పడటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. కనీసం గోతులు పూడ్చకుండా.. రోడ్డును తవ్వేశారని మండిపడుతున్నారు. గతంలో చిన్న గోతులు మాత్రమే ఉండేవని, ఇప్పుడు పెద్ద నూతుల్లా తయారు కావడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నామని వాపోతున్నారు. వర్షాలు కురిస్తే బురద రోడ్డుగా మారుతుందని, ఎండలు కాస్తే రోడ్డే కనిపించనంత దుమ్ము, ధూళి రేగి, కళ్లలో పడి, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు కాళ్లూచేతులూ విరిగి మంచాన పడుతున్న దుస్థితి నెలకొంది.

ఇదీ ‘బాబు’ మాట!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదట గోతులు పూడ్చి, రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తామని, జనవరిలో పండగ సమయానికి రహదారిపై గోతులు ఉండవని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్పగా చెప్పారు.

ఒకవేళ ఎక్కడైనా గోతులుంటే స్థానిక ఎమ్మెల్యేదే తప్పని, ప్రభుత్వానిది కాదని స్పష్టం చేశారు. అవసరమైతే ఎమ్మెల్యేనూ నిలదీయవచ్చని చెప్పారు. కానీ, దీనికి విరుద్ధంగా ఈ రోడ్డును పూర్తిగా తవ్వేసి, వదిలేయడంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈ రోడ్డులో రెండు నెలల క్రితం కానూరు పీహెచ్‌సీ వైద్యుడు జారి పడటంతో చేయి విరిగింది. ఈ మార్గంలో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గోతులు.. నూతులు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఈ రహదారిలో ఏర్పడిన గోతులు నూతులను తలపిస్తున్నాయి. ఎండ కాసినప్పుడు దుమ్ము రేగడంతో పాటు, వాహనాల వేగానికి రాళ్లు లేచి సమీపంలో ఉన్న వారిపై పడి గాయపడుతున్నారు. ముఖ్యంగా ఉసులుమర్రు, కానూరు, తీపర్రు గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇక్కడ గోతులతో పాటు, రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై గోతులు, రాళ్ల వల్ల గడచిన ఆరు నెలల్లో 45 ప్రమాదాలు జరిగాయి. ఇందులో 17 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో ముగ్గురు మహిళలు, 14 మంది పురుషులున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తూతూమంత్రంగా..

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ రహదారిలో గోతులను పూడ్చేందుకు నిధులు మంజూరు చేస్తామని నాయకులు ప్రకటించారు. తొలుత పెరవలి నుంచి ఉసులుమర్రు వరకూ గోతులు పూడ్చి, కానూరు – ఉసులుమర్రు మధ్య రోడ్డును తవ్వేసి చేతులు దులుపుకొన్నారు. ఈ రోడ్డుపై రాళ్లు, బూడిద వల్ల నానాపాట్లూ పడుతున్నామని, వాటిని తొలగించాలని స్థానికులు కోరినా.. పట్టించుకున్న నాథుడే లేడు.



రోడ్డు దిగితే గండమే..: ఉసులుమర్రు లబ్బరు పుంత వద్ద ఏర్పడిన గొయ్యి



అడుగడుగునా ఛిద్రమే..: కానూరు - ఉసులుమర్రు వద్ద ఏర్పడిన గోతులు

ఈసారికింతే..



పంపా బ్యారేజీ గేటు నుంచి వృథా పోతున్న నీరు

- పంపా బ్యారేజీలో ఒక్క గేటుకే మరమ్మతులు
- మిగిలిన 4 గేట్ల పనులు వచ్చే ఏడాదే..

అన్నవరం: అంతన్నారింతన్నారే.. అన్న పాట చందంగా తయారైంది అన్నవరంలోని పంపా బ్యారేజీ గేట్ల మరమ్మతుల వ్యవహారం. వీటి మరమ్మతులకు రూ.3.36 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. తీరా చూస్తే ఆచరణ మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీ రెండో నంబర్ గేటుకు మాత్రమే మరమ్మతు చేయిస్తారని పంపా అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరుకల్లా ఆ పనులు పూర్తి చేస్తామని అంటున్నారు. జూలైలో వర్షాలు కురిసి, ఖరీఫ్ పనులు ప్రారంభమవుతాయని, ఈ ఏడాది రబీ పంటకు కూడా నీరిచ్చే ఆలోచన ఉన్నందున మిగిలిన నాలుగు గేట్ల మరమ్మతులు వచ్చే ఏడాది మార్చి తరువాత జరుగుతాయని చెబుతున్నారు.

12,500 ఎకరాల ఆయకట్టు

పంపా రిజర్వాయర్ కింద తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో 12,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఒకసారి ఆయకట్టు మొత్తం సాగవ్వాలంటే 1.5 టీఎంసీల నీరు అవసరం. పంపా గర్భంలో నుంచి పుష్కర కాలువ నిర్మాణం జరగక ముందు ఈ రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 105 అడుగులుండేది. ఆ స్థాయిలో 0.5 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. పుష్కర కాలువ నిర్మించిన తరువాత రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులకు, నీటి నిల్వలను 0.44 టీఎంసీలకు పరిమితం చేశారు. దీంతో ఖరీఫ్ పంట కాలంలో రిజర్వాయర్ నాలుగుసార్లు నిండితే తప్ప ఖరీఫ్ గట్టెక్కని పరిస్థితి ఏర్పడింది.

నీరు.. కదలిపాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకూ పంపా ఆయకట్టులో ఖరీఫ్, రబీ సాగుకు నీరిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గేట్ల మరమ్మతుల సాకుతో గడచిన రబీలో పంపా ఆయకట్టు కింద సాగుకు విరామం ప్రకటించింది. అంతే కాదు.. పంపాలో 90 అడుగులకు పైగా నీటిమట్టం ఉండగా.. నీటిని వృథాగా సముద్రంలోకి వదిలేసి 84 అడుగులకు తగ్గించింది. ఇంతా చేసి గేట్లకు మరమ్మతులు చేశారా అంటే అదీ లేదు. ఈ పనులకు రెండుసార్లు టెండర్లు పిలిచినా ఖరారు కాలేదు. మూడోసారి నిబంధనలు సడలించి గత ఏప్రిల్‌లో టెండర్లు పిలవగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన రాధాకృష్ణ ఏజెన్సీస్ ఈ టెండర్ దక్కించుకుంది. గేట్ల మరమ్మతులు, పోలవరం అక్విడెక్ట్ పేరుతో నీటిని వృథాగా వదిలేయడంతో రిజర్వాయర్‌లో నీటినిల్వలు అడుగంటిపోయాయి. గత మార్చి నెలాఖరుకు 79 అడుగుల స్థాయిలో డెడ్ స్టోరేజీకి చేరింది. ఈ పరిస్థితుల్లో శ్రీరామనవమి, సత్యదేవుని కల్యాణోత్సవాల్లో శ్రీచక్రస్నానాలకు, అన్నవరం దేవస్థానం, గ్రామానికి నీటి సమస్య ఉత్పన్నమవుతుందని దేవస్థానం అధికారులు కలెక్టర్ షణ్మోహన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి, ఏలేరు రిజర్వాయర్ నుంచి పంపాకు నీటి విడుదలకు చర్యలు తీసుకున్నారు. అయితే ఏప్రిల్ మొదటి వారం నుంచి కురిసిన వర్షాలకు పంపాలో చేరడంతో ఏలేరు నుంచి నీటిని విడుదల చేయించనవసరం లేకపోయింది. ప్రస్తుతం పంపా రిజర్వాయర్ నీటిమట్టం 87.6 అడుగులకు చేరింది. బ్యారేజీ గేట్లు, పంట కాలువ స్లూయిజ్ గేట్ల వద్దకు నీరు చేరింది. అయితే, పంపా గేట్ల మరమ్మతులతో పాటు, అక్విడెక్ట్ పనులకు ఆటంకం ఏర్పడుతుందని పోలవరం అధికారులు చెప్పడంతో ఆ నీటిని 80 క్యూసెక్కుల చొప్పున దిగువకు వృథాగా వదిలేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలోనే..

పంపా బ్యారేజీ గేట్లు వరదల సమయంలో ఎత్తితే దిగవు. దించితే మళ్లీ పైకి లేవవనే పరిస్థితి. వీటి మరమ్మతులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023 జూలైలోనే ప్రణాళిక రూపొందించింది. 2024 జనవరిలో నిధులు మంజూరు చేసింది. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్‌తో ఈ నిధుల విడుదలకు బ్రేక్ పడింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో పంపా బ్యారేజీ గేట్ల మరమ్మతులకు రూ.3.36 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ పనులు యుద్ధ ప్రాతిపదికన చేయిస్తామని ప్రకటించింది.

టెండర్ల ఖరారులో జాప్యం



పంపా బ్యారేజీ గేట్ల మరమ్మతు పనులకు టెండర్లు ఖరారవడం ఆలస్యమైంది. మూడుసార్లు టెండర్లు పిలవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యేలోపు బ్యారేజీ ఐదు గేట్లకూ మరమ్మతులు చేయడానికి సమయం చాలడం లేదు. అందువలన బాగా ఇబ్బందిగా ఉన్న రెండో నంబర్ గేటుకు మాత్రమే మరమ్మతులు చేయిస్తున్నాం. ఈ పనులు ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం. వచ్చే మార్చి తరువాత మిగిలిన గేట్ల మరమ్మతులు పూర్తి చేయిస్తాం.

– జి.శేషగిరిరావు, ఈఈ, జలవనరుల శాఖ

నాణ్యమైన విద్యకు నవోదయం

- 2026–27 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- జూలై 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు
- ఈ ఏడాది డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష

రాయవరం: జవహర్ నవోదయ విద్యాసమితిలో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా 661 నవోదయ విద్యాలయాలు ఉండగా..కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఉంది. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని విద్యార్థులు ఇక్కడ దరఖాస్తుకు అర్హులు. 2026–27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్యను ఇక్కడ అందిస్తారు. విద్యతో పాటు అధునాతన సౌకర్యాల కల్పన, ప్రయోగాత్మక విద్య, క్రీడలు, క్రమశిక్షణ, ప్రతిభకు పెద్దపీట వేయడం ఈ విద్యా సంస్థల ప్రత్యేకత. పరీక్షకు ఎవరు అర్హులు, పరీక్షా విధానం, రిజర్వేషన్ తదితర వివరాలతో 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఒక్కసారే అవకాశం

ఈ ఏడాది డిసెంబర్ 13న నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి విద్యాలయలో ప్రవేశం లభిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయాల్లో మొత్తం 80 సీట్లు ఉంటాయి. ఆరవ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఆయా మండలాల్లో ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. ఈ ప్రవేశ పరీక్షకు ఒక్కసారి మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది.



2026–27 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందగోరే బాలబాలికలు 2014 మే ఒకటో తేదీ నుంచి 2016 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో 3,4 తరగతులు ఉత్తీర్ణత సాధించి ఐదో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు.

రిజర్వేషన్ విధానం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం తగ్గకుండా సీట్లు కేటాయిస్తారు. షెడ్యూల్ కులాలకు 15 శాతం, షెడ్యూల్ తరగతులకు ఏడు శాతం, దివ్యాంగులకు మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రవేశాల్లో బాలికలకు 33 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తారు.

వసతులు

బాలబాలికలకు వసతి గృహాలు, భోజనం, విద్య, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్, షూస్, టాయిలెట్ సామగ్రి ఉచితం. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నవోదయ విద్యాలయాల్లో బోధన చేస్తారు. శాస్త్ర, సాంకేతికతతో కూడిన విద్య, క్రీడలు, యోగా ద్వారా విద్యార్థికి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కల్పిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నామమాత్రపు రుసుం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు, బాలికలకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసిన తర్వాత దరఖాస్తు ఫారాన్ని ప్రింట్ తీసుకుని దగ్గర ఉంచుకోవాలి. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. జూలై 29వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాల్సి ఉంది. దరఖాస్తుకు రుసుం చెల్లించనవసరం లేదు.

పరీక్షా విధానమిదీ..

నవోదయ ప్రవేశ పరీక్షను 2025 డిసెంబరు 13న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు భాషను(తెలుగు/ఇంగ్లీషు) ఎంచుకొని పరీక్ష రాసే వీలుంది. ప్రవేశ పరీక్షలో 80 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు పరీక్ష నిర్వహియిస్తారు. మూడు విభాగాల్లో ప్రశ్నలు కేటాయిస్తారు. మేధాశక్తిపై 40 ప్రశ్నలు 50 మార్కులకు, గణితం(అర్థమెటిక్), ఎంచుకున్న భాషపై ఒక్కొక్క విభాగానికి 20 ప్రశ్నలు వంతున 40 ప్రశ్నలు 50 మార్కులకు ఉంటాయి. తప్పుడు సమాధానాలకు నెగెటివ్ మార్కులు ఉండవు. దివ్యాంగులకు 40 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు. పరీక్షలను సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) నిర్వహిస్తుంది. ఎంపికైన వారికి మొదటి రెండు సంవత్సరాలు తెలుగు/ఇంగ్లిషు భాషల్లో బోధిస్తారు. అనంతరం ఇంగ్లిషులోనే బోధన చేస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

గతేడాది జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..

జిల్లా	వచ్చిన దరఖాస్తులు
కోనసీమ	3,869
తూర్పుగోదావరి	1,741
కాకినాడ	3,361

అధికారులు అవగాహన కల్పించాలి



అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యేలా విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించాలి. గతేడాదికి మించి దరఖాస్తులు వచ్చేలా ఎంఈవోలు పర్యవేక్షణ చేయాలి
– బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, పెద్దాపురం

క్లుప్తంగా

జేఈఈలో ప్రవీణ్‌కుమార్‌కు 328వ ర్యాంకు



మామిడికుదురు: ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో పాశర్లపూడిలంకకు చెందిన కోలా ప్రవీణ్‌కుమార్ సత్తా చాటాడు. ఇతను జాతీయ స్థాయిలో 328వ ర్యాంకు సాధించాడు. విజయవాడ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న ప్రవీణ్‌కుమార్‌కు ముంబయి సీఎస్‌ఈలో సీటు వచ్చింది. తండ్రి గోపాలకృష్ణ రైతు, తల్లి జ్యోతి గృహిణి. పేరెంట్స్ ఎంతో కష్టపడి కొడుకును చదివించారు. ప్రతి రోజు 14 గంటలు చదవడం వల్ల మంచి ర్యాంకు వచ్చిందని ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపాడు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలన్నదే తన లక్ష్యమని తెలిపాడు. అతడిని స్థానికులు అభినందించారు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి ఐదురోజులు, తొమ్మిది మందికి రెండు రోజుల చొప్పున జైలు, 17 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో 27 మందిని హాజరుపర్చగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పోలీసుల అదుపులో కారు యజమాని



పోలీసులు స్వాధీనం చేసుకున్న రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు

అమలాపురం టౌన్: స్థానిక ఏఎస్‌పీ ఆస్పత్రి వద్ద 216 జాతీయ రహదారిపై ఓ మోటారు సైకిలిస్టును ఢీకొట్టి తీవ్రంగా గాయపరచడమే కాకుండా అక్కడ నుంచి కారుతో సహా పరారైన వ్యక్తిని పట్టణ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఆ కారు యజమాని దీపక్‌ను అదుపులోకి తీసుకుని రోడ్డు ప్రమాదంలో ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై ఎస్‌ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. స్థానిక పితానివానిపాలేనికి చెందిన దీపక్ స్థానికంగా రోల్స్ ఆన్ రోడ్డు పేరుతో హోటల్ నిర్వహిస్తున్నాడని ఎస్సై పేర్కొన్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో కేసును విచారిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి అమలాపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఇద్దరు లారీ డ్రైవర్ల దుర్మరణం



కాపవరం వద్ద జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు మండలం కాపవరం వద్ద హైవే పై మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు మృతి చెందారు. కొవ్వూరు ఎస్సై శ్రీహరిరావు తెలిపిన వివరాల ప్రకారం లారీ డ్రైవర్ బత్తుల శీనయ్య(40) హైదరాబాద్ నుంచి మండపేటకు ధాన్యం లోడుతో వస్తున్నాడు. కాపవరం వద్దకు వచ్చే సరికి కునుకుపాటుకు గురై ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టి అనంతరం రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో లారీ ఆగిపోయింది. ఈ లారీని ఇతర వాహనాలకు ఢీకొనకుండా, శీనయ్య కిందకు దిగి డైరెక్షన్ ఇస్తూ దారి చూపుతున్నాడు. ఇంతలో జంగారెడ్డిగూడెం నుంచి ధాన్యం లోడుతో వస్తున్న మరో లారీ.. శీనయ్య లారీని బలంగా ఢీకొట్టడంతో అందులోని డ్రైవర్ కొయ్యే బాబూరావు(40) లారీ క్యాబిన్లో ఇరుకుపోయి మృతి చెందాడు. డైరెక్షన్ ఇస్తున్న బత్తుల శీనయ్య కూడా ఐచర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతదేహాలను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీహరి తెలిపారు.

అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలకు జట్టు ఎంపిక



పురుషుల క్రికెట్ జట్టు



మహిళల క్రికెట్ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయనగరం జిల్లాలో 4 నుంచి 7 వరకు జరిగే ఏసీఏ నార్త్ జోన్ క్రికెట్ పోటీలలో పాల్గొనే పురుషుల జిల్లా జట్టు ఎంపికను మంగళవారం నిర్వహించినట్లు తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్ఎంసీ క్రీడామైదానంలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో 15 మందిని ఎంపిక చేశామన్నారు. ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే ఏసీఏ నార్త్ జోన్ మహిళల అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపికను నిర్వహించామని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘం తరఫున క్రీడాదుస్తులు అందజేశామని తెలిపారు.

ఉత్కంఠగా సీనియర్ ఓపెన్ చెస్ పోటీలు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విద్యానిధి విద్యాసంస్థల ప్రాంగణంలో మంగళవారం జరిగిన సీనియర్ ఓపెన్ చెస్ జిల్లా స్థాయి పోటీలు ఉత్కంఠగా జరిగాయి. ఈ జిల్లా స్థాయి పోటీల్లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన విజేతలను రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. ద్రాక్షారామ సాత్విక్ (ప్రథమ), తాడి వెంకటేష్ (ద్వితీయ), బండారు నానిబాబు (తృతీయ), పి.ధరణి (4వ స్థానం) సాధించారని చెప్పారు. ఈ నలుగురు విజేతలు ఈనెల 6వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని వెంకట సురేష్ తెలిపారు. విజేతలకు విద్యానిధి స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి బహుమతులు అందజేశారు.



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విజేతలతో జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

పేకాట క్లబ్‌పై దాడి

యానాం: ప్రభుత్వానికి చెందిన యానాం మున్సిపల్ లాడ్జిలో పేకాట క్లబ్ నిర్వహిస్తూ లక్షలాది రూపాయల మేర చేతులు మారుతున్న వైనంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం అర్ధరాత్రి అధికారులు దాడులు నిర్వహించారు. కొన్ని నెలలుగా మున్సిపల్ లాడ్జిని కేంద్రంగా చేసుకుని యానాం, కాకినాడ, రాజమహేంద్రవరం, రామచంద్రపురం, మండపేట తదితర ప్రాంతాలకు చెందిన వందమంది పేకాట క్లబ్‌ను ప్రారంభించారు. గుట్టుచప్పుడు కాకుండా ఎవరికిచ్చే మామూళ్లు వారికిస్తుండటంతో పేకాట క్లబ్ సాఫీగా సాగిపోయింది. స్థానిక న్యూబస్టాండ్ పైన మున్సిపల్ లాడ్జి ఉండటంతో బస్సుల, ప్రయాణికుల హడావుడితో అధికసంఖ్యలో పేకాటరాయుళ్లు వచ్చినా ఎవరికీ తెలియలేదు. పోలీసులు సైతం పట్టించుకోకపోవడంతో అర్ధరాత్రి సైతం పేకాట నిరాటంకంగా సాగిపోతుండటంతో స్థానిక సోషల్ యాక్టివిస్ట్ శంకర కార్తీక్ మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి రావడంతో పేకాటరాయుళ్లు పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, వారిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తెలిపారు. అయితే చాలా లాడ్జిల్లో పేకాట ఆడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' పుస్తకావిష్కరణ

కపిలేశ్వరపురం (మండపేట): 'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' అనే పుస్తకాన్ని జమాత్–ఎ–ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీఖ్ ఆవిష్కరించారు. మండపేట పట్టణం గాంధీనగర్ అల్–అమీన్ మస్జిద్‌లో మంగళవారం జమాత్–ఎ–ఇస్లామీ హింద్ మండపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక సమావేశంలో రఫీఖ్ పలు అంశాలను ప్రస్తావించారు. దేశంలో 20 కోట్ల మంది ముస్లింలు జరుపుకునే బక్రీద్ పండగ పాడిరైతులకు ఆర్థిక చేయూతనిస్తుందన్నారు. వక్ఫ్ చట్టంపై కేంద్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారాన్ని చేస్తోందని, మేధావులు, ధార్మిక సంస్థలు, ప్రజాసంఘాలు శాస్త్రీయ దృక్పథంతో వక్ఫ్ చట్టాన్ని సమీక్షించాలని కోరారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో 'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' పేరుతో ప్రచురితమైన పుస్తకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో జమాత్–ఎ–ఇస్లామీ హింద్ స్థానిక కమిటీ అధ్యక్షుడు ఫారుఖ్ అలీ, జిల్లా అధ్యక్షుడు అబుల్ ఆలా, అల్– అమీన్ మస్జిద్ అధ్యక్షుడు రహీం, జమియా మస్జిద్ అధ్యక్షుడు అల్తాఫ్, ముస్లిం జేఏసీ నాయకులు ఎండీ కరీం, సయ్యద్ ఇబ్రాహీం షరీఫ్, షేక్ ఇబ్రాహీం, కరీం పాల్గొన్నారు.



మండపేటలో 'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జమాత్-ఎ-ఇస్లామీ హింద్ నాయకులు

ఐటీఐ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

రాయవరం: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించగా, మొదటి రోజు 80 మంది హాజరు కాగా, వారిలో 76 మందికి వారు కోరుకున్న ట్రేడ్‌లో సీట్లు కేటాయించినట్లు తెలిపారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



కాజులూరు మండలం గొల్లపాలెంలో విద్యుత్‌వైర్లను సైతం తాకేలా ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్న యువకులు

కాజులూరు: కాలువలకు నీరుకట్టివెయ్యటంతో డెల్టా ప్రాంతంలో మట్టిపనులు జరుగుతున్నాయి. మండల గ్రామాలలోని పొలాల్లో మెరక పనులు నిర్వహించేందుకు దూర ప్రాంతాల నుంచి పొక్లెయిన్, జేసీబీలను ఇలా లారీలపై తరలిస్తున్నారు. ఈ సమయంలో పొక్లెయిన్ డ్రైవర్లు, క్లీనర్లు అదనపు ప్రయాణ ఖర్చులెందుకని ఇలా ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తున్నారు.

రైల్వే బ్రిడ్జిల పరిరక్షణకు చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి నదిపై గల ప్రతిష్టాత్మకమైన రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జి, ఆర్చ్ బ్రిడ్జిల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ పీఈ ఎడ్విన్ పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో గల రెండు బ్రిడ్జిలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే వంతెనలపై జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల నాణ్యత, భద్రతా తనిఖీని నిర్వహించామన్నారు. 2027 నాటికి సురక్షితమైన, బలమైన వంతెనలుగా తీర్చిదిద్దడానికి, రూ.115 కోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ కమ్ రైల్ బ్రిడ్జ్ పై సురక్షితమైన ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఐకానిక్ ఆర్చ్ బ్రిడ్జ్‌పై రూ.70 కోట్లతో కేబుల్ రీ ప్లేస్మెంట్ వర్క్ పూర్తి చేస్తున్నామన్నారు. భారతీయ రైల్వేలతో అవగాహన ఒప్పందం కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మద్దతును ఆశిస్తున్నామన్నారు. పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ పీఈ ఎడ్విన్

సచివాలయ సెక్రటరీపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం రూరల్: రాజానగరం మండలం రాధేయపాలెం గ్రామ సచివాలయంలో జయబున్నీసా బేగం గ్రేడ్–5 హోదాలో సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆ సచివాలయంలో వారంతా ఒకే నోటిఫికేషన్‌లో నియమితులయ్యారు. దీంతో వారి మధ్య సీనియారిటీ సమస్య కూడా లేదు. అయితే, బేగంకు కొన్నాళ్ల క్రితం డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ ఆఫీసర్(డీడీవో)గా అదనపు బాధ్యతలు కేటాయించారు. డీడీవోగా సిబ్బంది జీతాల ఫైల్ సిద్ధం చేయడం ఆమె చేతిలోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో తమను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని ఆ సచివాలయ సిబ్బంది రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లోని డీఎల్‌డీవో, వార్డు, గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి వీణాదేవిని కలిసి తమ గోడును వెళ్లబోసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మే నెల జీతాలు నేటికీ రాలేదని బేగం ఫైల్ సిద్ధం చేయకపోవడమే అందుకు కారణమని డీఎల్‌డీవో దృష్టికి తీసుకెళ్లారు. బేగం వైఖరి పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేసిన డీఎల్‌డీవో సిబ్బంది ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలకు సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు.



డీఎల్‌డీవో వీణాదేవికి సమస్య వివరిస్తున్న సచివాలయ సిబ్బంది

కాపులపై కేసులను తిరగతోడితే సహించం

ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): కాపుల సామాజిక ఉన్నతికి ప్రాణప్రదమైన రిజర్వేషన్ల ఉద్యమ నేపథ్యంలో కాపులపై పెట్టిన కేసులను తిరగతోడేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. మరోసారి ఇలాంటి ప్రయత్నాలను చేస్తే రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా లేక రాష్ట్రంలో సామాజిక సమస్యలను సృష్టించే స్థాయికి కూటమి ప్రభుత్వం దిగజారుతోందన్నారు. తుని ఆందోళన నేపథ్యంలో కాపులపై పెట్టిన కేసులను 2023 మే 1న విజయవాడ ఏడవ అదనపు మెట్రో పొలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు రద్దు చేస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పును పునర్విచారణ చేయాలంటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం సోమవారం రాత్రి హడావుడిగా జీవో జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని రైల్వే శాఖ పరిధిలోని కేసును రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎలా తిరగతోడుతుందని ప్రశ్నించారు. రాష్ట్రం మొత్తం మీద కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా పాలన సాగిస్తోందని, అదే వైఖరిని కాపు సామాజిక వర్గీయుల పట్ల అవలంబిస్తున్నట్టు స్పష్టమవుతోందన్నారు. ఇలాంటి చర్యలకు కూటమి ప్రభుత్వం మరోసారి పాల్పడితే ప్రజా క్షేత్రంలోనే ఎదుర్కొంటామని ఎమ్మెల్సీ తోట హెచ్చరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ప్రభుత్వ ఆదేశాలు భేఖాతర్

మునికూడలి ర్యాంపులో ఆగని ఇసుక రవాణా

సీతానగరం: జిల్లాలో 28 ఇసుక ర్యాంపులు నిలిపివేస్తున్నట్లు అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను భేఖాతరు చేస్తూ మునికూడలి ర్యాంపు నుంచి ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. మండలంలోని ములకల్లంక రెవెన్యూ భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి కాటవరం ర్యాంప్ నుంచి, పక్కిలంక రెవెన్యూ భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి మునికూడలి ర్యాంపు నుంచి, రఘుదేవపురం, వంగలపూడి ర్యాంపుల నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. ర్యాంపులను అక్టోబర్ వరకు నిలిపివేస్తున్నట్లు, ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని సోమవారం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే పక్కిలంక భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి లారీలపై మునికూడలి ర్యాంపు నుంచి రవాణా చేస్తున్నారు. గోదావరి నదీ గర్భంలో మూడు భారీ పొక్లెయిన్‌లతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి సమయంలో కూడా ఇసుక రవాణా జరుగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా తక్షణమే ర్యాంపును నిలిపివేస్తామని తెలిపారు. అయితే మంగళవారం రాత్రి కూడా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరిగాయి.



మునికూడలి ర్యాంపులో గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక లారీలు, పొక్లెయిన్